శిక్ష

గంటి వెంకటరమణ

అనురసంధ్య ప్రపంచాన్ని పులుముకుంది. మంచం మీద పడుకున్న రాధిక మనసు నిండా భయం నిండిపోయి వేయి వాలుకలతో విజృంభిస్తూ అసలే రోగంతో, బాధతో కొట్టుకుపోతున్న మనిషిని యింకా యింకా అగాధంలోకి లాక్కుపోతోంది. సుమారు నలభై సంవత్సరాలు నిండిపోయిన రాధిక శరీరం కన్నా మనసు వార్ధక్యాన్ని కౌగలించుకుంది.

చాలీ చాలని జీతంతో మధ్య తరగతి కుటుంబంలో ఓ మాదిరి సాంఘిక కట్టుబాట్ల మధ్య పెరిగారు రాధికా, యమునా. అన్న గోవిందు ఆలంబనతో యౌవ్వనంలో అడుగుపెట్టారు.

ఆకాశంలో రంగులు క్షణక్షణానికి మారుతున్నాయి. రాధిక మనసు గతాన్ని త్రవ్వుకుంటూ పాతిక సంవత్సరాల వెనక్కు వెళ్ళి ఆగిపోయింది.

'ఏయ్ రాధా ఈ చీర నీకు. యిది యమునకి, యిది మీ వదినకి' గోవిందు చీరెల పాకెట్ విప్పి బల్లమీద పెట్టాడు.

సరస్వతి నవ్వింది. 'నాకు వక్క నేత చీరలూ మీ చెల్లెళ్ళకి సన్నవీ,వాయిల్‌వీనా,' అంటూ.

అందుకు యమునే సమాధానం యిచ్చింది... 'అన్నయ్య అలాగే అంటాడు వదినా. మీరు తీసుకున్నాకనే మేము తీసుకుంటాం. ముందు మీరే ఎన్నుకోండి. కాదంటే అప్పుడే అన్నయ్యనీ మమల్నీ అందురుగాని'

ఆడపడచుల మధ్యగా కూర్చుని భర్త వైపు చూసింది సరస్వతి: 'తెలివి తేటలకి వాకళ్ళకి మించి మరొకళ్ళు మీ అన్నా చెల్లెళ్ళు. మీ కోసమే అని ప్రత్యేకం ఆయన తెస్తే నేనెలాగూ తీసుకోనని తెలుసు నీకు. మామూలేకదా అని అనేశావు'

'తీసుకుందుకి వదినకి దమ్ములేవక్కా. అందుకే నింద మనమీద వేస్తోంది. నా వాయిల్ చీర మీరే తీసుకోండి వదినా. నేను కాదంటే అప్పుడు చూసుకుందురు గాని,' రాధిక చీర మడత విప్పి వదినగారి భుజం చుట్టూ వేసింది.

సరస్వతి చీరెను సున్నితంగా తీసి బల్లమీద పెట్టేసింది. 'తమాషా చేశానంతే. ఈ వయసులో ఆ చీరెలు కట్టుకుంటే బజార్లో వెళ్ళేవారంతా నిలబడిపోయి నన్నే చూస్తారు.'

'పోన్లే సరూ మంచి గిరాకీ టిక్కెట్టు పెడితే. ఓసారి కట్టుకోవోయ్ నాకూ చూడాలని వుంది,' గోవిందు భార్యని వేళాకోళం పట్టించాడు.

అది గమనించి సరస్వతి మాట్లాడకుండా కళ్ళతో ప్రేమని కురిపిస్తూ, ఆడబిడ్డల్నీ, భర్తనీ చూడసాగింది.

* * *

'పిల్లడు అచ్చు మీ పోలికే వదినా. ఆ నోరు కొంచెం చిన్నది పెట్టివుంటే మరీ బాగుండిపోను. ప్చ్! యేం లాభం? ఆ వదిన కొడుకని నలుగురికు స్టాంపు వేసినట్లు తెలిసిపోతుంది,' యమున వుయ్యాల్లోంచి పాపను తీసి యెత్తుకుని ముద్దులు కురిపిస్తూండి పోయింది.

అక్క చేతిలో వున్న పాప కుడిచేతికి అందుకుని ఆ చేతులకి వొంటిరాయి వుంగరం, మురుగులు పెట్టి చెంపలమీద ముద్దు పెట్టుకుంటున్న రాధికను గోవిందు మార్చి మార్చి చూశాడు. 'యిప్పుడెందుకు యివి. మీకేం పిచ్చా. ఆ డబ్బు వుంటే ముగ్గురికీ మంచి చీరలు రాకపోయేవా,' మెల్లిగా మందలించాడు చెల్లెళ్ళని.

యమున అంది. 'యింటికి నువ్వు పెద్ద వాడివి. నాన్నగారు వుంటే అలాగే చేసే వారు. కానీ మనకు అదృష్టం లేదన్నయ్యా. పోయిందేమీ లేదు. చేతిలో వున్న సరస్వతి దేవి దయవల్ల యీపాటి చేయగల్గాం అనే తృప్తి మాకు వుంది.'

'మిమ్మల్ని హద్దుల్లో వుంచక పోవడం నాదే పొరబాటు. విచ్చల విడిగా ఖర్చు పెట్టేస్తే రేపు పెళ్ళి పేరంటం సంగతి ఆలోచించాలా, వొద్దా,' సరస్వతి ముసుమ్మారిగానే అంది.

* * *

'యమునకి పెళ్ళిచేయాలి. మీరేమీ పట్టించుకోక పోతే యెలా చెప్పండి. నలుగురూ అడిగే ప్రశ్నలకి జవాబు యివ్వలేక పోతున్నాను. నా మెడలో వున్నది అమ్మేస్తే ఓ యెనిమిది వందలు రాకపోవు,' భర్త మంచం మీద వో చివర కూర్చుంటూ అంది సరస్వతి. యెనిమిదివందలకి తగిన సంబంధం రాకపోదు అనే వుద్దేశ్యంతో.

గోవిందు మొహంలో కిరసనాయిల్ దీపపు కాంతులు పడి భార్యకి ఆ మొహంలో వున్న భావాలు స్పష్టంగా కనిపించి పోతున్నాయి.

'[illegible] చూడకండి. ఆ చూపులకి నేను అడిగే ప్రశ్నలూ, వాటికి వొచ్చే సమాధానాలూ. అడుగునే పడిపోతున్నాయి. నన్నేం చేయమంటారు? ఈడేరిన పిల్లల్ని యిద్దర్నీ యింట్లో వుంచుకుని మీతో నేను రాసక్రీడలు సలుపుతూంటే మగవాడైల్లాగూ గ్రహించడు. ఆడది దానికేమైంది అంటున్నారు.'

'నిజం ఆలోచిస్తే నలుగురూ అన్నారని దేనికి? వాళ్ళే బాగులేదు. ఈ చేతుల్లో పిల్లల కన్నా ఎక్కువగా పెంచి పెద్దచేశాను. మన మీద యింకా కొద్ది బాధ్యత రోజు రోజుకీ పాపం పెరిగినట్లు పెరిగిపోతుంది. మీరు యిలా యెంతకాలం ముక్కుమూసు కూర్చుంటారో అర్థం కావడంలేదు,' సరస్వతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. భర్త గుండెల మీద తల ఆన్చి మెల్లగా యేడుస్తూండి పోయింది.

'హద్దులే. ఏడవకు సరూ. నీకు తెలీదూ నా సంగతి,' ఒక్కొక్క మాటే మెల్లగా కూడబలుక్కుంటూ అన్నాడు.

'మీ సంగతి తెలియాల్సినది నాకుకాదు. ప్రపంచానికి. గోవిందు భార్య మెడనిండా నగలున్నాయి, పెట్టినిండా చీరలున్నాయనే తెలుసును యీ ప్రపంచానికి. కానీ ఆ గోవిందుకి వచ్చే సంపాదనా, సంసారం గురించి తెలీదు. ఈ నేనవితో యమునను సాగనంపి తేనే గాని నేను నీరు ముట్టేదిలేదు,' సరస్వతి సంఘం మధ్య అడకత్తెరలో పోకలా నలిగి నలిగి బేజారైపోయింది.

* * *

వదినకి,

యమున నమస్కరించి వ్రాయుడం. జీవితం నిస్సారంగా వుండడం నాకు యెంత మాత్రం యిష్టం లేదు. ఒకే రకం చీర కట్టుకుందుకి మన మనస్సెందుంకు వొప్పుకోదో అర్థం అయింది. మామూలుగా సాఫీగా సాగే ఆ జీవితం నాకు వొద్దు. నేనూ మనిషినే నాకూ కోరికలున్నాయి. వాటిని గ్రహించేందుకూ, ఆచరణలో పెట్టిందుకూ కన్నవారు లేకుండా పోయారు. విచారించి యేమీ లాభం వుండదనీ, మార్గం వెతుక్కునే అవసరం నాపైనే వున్నదనీ గ్రహించాను. నా కోరిక లేమీ ఆకాశాన్నంటేవికావు. నాకూ ఓ భర్త అతని ఆదరణా, కట్టుకుందుకి బట్ట, బతికేందుకు తిండీ అవసరం అని సులభంగా తెలుసుకున్నాను. ఎంత చదివినా ఎన్ని విధాల పురోగమిస్తున్నా ఓ నీడలేనిదే 'స్త్రీ' రాణించలేదేమో.

అన్నయ్య నిర్లక్ష్యం నా మీద బలంగా పని చేసింది. ఏం చేయను. నాకు కావలసింది పరిపూర్ణత్వంతో నిండుకున్న 'స్త్రీ' జీవితం. 'ఆయనా' నేనూ రిజిస్టర్ వివాహం చేసుకున్నాం. కులం కాదు ప్రధానం. మీ నీడన రాధిక కోలాటి కోట్లాడదని, తెలుసు నాకు. నేను ఆలస్యాన్ని భరించలేక పోయాను. అంతే.

మీ

యమున.

గోవిందు యేడ్చాడు. మామూలుగా కాదు. ఆడపిల్లలకన్నా అధ్వాన్నంగా గుండెలు పగిలేట్లు యేడ్చాడు. యేడ్చి యేడ్చి అలసిపోయిన గోవిందు దృష్టికి ప్రపంచం వంచించినట్లూ, తనని చూసి నలుగురూ హేళన చేస్తున్నట్లూ భావించాడు. చివరికి అతను యెవరికీ యెదురు పడడం మానేశాడు. భూమిలో కంటా తలని దూర్చేసి నడవడం నేర్చుకున్నాడు. పలకరించిన ప్రతివాడికీ ఓ నవ్వు విసిరేసి నాటకంలో సూత్రధారుడై పోయాడు. అతనికున్న బెంగ వొక్కటే. తను గారాబంగా పెంచుకున్న రెండు మొక్కల్లో వో మొక్కను హఠాత్తుగా ఎవరో లాక్కుపోయారు. అది రాక్షసులో, గంధర్వులో మాత్రం తెలీదు. ఈసారి మిగిలిపోయిన చిన్నారి మొక్కను తన గృహ ప్రాంగణంలో కాక బృందావనంలో తులసి చెట్ల మధ్యనే పాతాలనే నిర్ణయానికి వచ్చేశాడు. కానీ...

గోవిందు మనసూ, జీవితంతో లెక్క లేదు బృందావనికి. తులసిచెట్ల మధ్య గంజాయి మొక్కకు విలువలేదు. నీ యింటి ఆవరణలోనే వుంచుకోమని చెప్పేసింది కరుణ లేని బృందావని. మిగిలిపోయింది మొక్క యెండకు యెండి, వానకు నాని వాడిలిపోతూ.

* * *

కాలగర్భంలో యిరవై యేళ్ళు దాటిపోయాయి బాణంలా దూసుకుపోతూ. రాధికకి పెళ్ళికానేలేదు. ఒకవేళ చేసుకుందామని వచ్చిన యిద్దరు, ముగ్గురు వ్యక్తుల్లో ఒకడు రాధిక కన్నా రెట్టింపుకు మించిన వయసువాడు. మరొకడు దృష్టి ఆనక పోయినా రాధికనే తన కంటి పాపల మాదిరి చూసుకుంటానని మాట యిచ్చేశాడు. మూడో వ్యక్తి అంతకు ముందు రెండు సార్లు పెళ్ళిచేసుకుని వాళ్ళు పోయాక వియోగం భరించలేక అపరదేవదాసే అయిపోయాడు. ఓ మోతాదుమించి, వొక ఆకు యెక్కువ చదివేడు గనుక రకరకాల యిళ్ళ

తోరణాలని గమనించి వొంటినిండా రోగాలు పెంచుకుని మరీ వచ్చేడు.

సరస్వతి ఖచ్చితంగా అనేసింది! మేము నలిగి పోయేమని యింకా నలిపేందుకు మీరెవరూ ప్రయాసపడనవసరంలేదు. నా పిల్ల నాకు బరువుకాదు. అలా అయిన రోజున దాన్ని గోదావరిలో పడేసి మేమూ దూకుతాం. మధ్యవర్తులని మిమ్మల్ని మేం కాళ్ళు అంటుకుని ప్రార్థించలేదు వెళ్ళండి,' ఆ తరువాత రాధికని గుండెల్లో యిముడ్చుకుని కంటికీ మంటికీ యేకధారంగా యేడ్చేసింది.

* * *

'అత్తా, లేచి పోవడం అనేది తప్పా,' పుస్తకాలు గిరవాటేసి రాధిక మెడచుట్టూ చేతులువేసి అడిగాడు ముకుందు.

'ఛ! నీకలాంటి మాటలెవరు నేర్పారు? బడికి వెళ్ళేది యిందుకా?' రాధిక కోపంగా చూసింది.

ముకుందు మొహం గంభీరంగా మారి పోయింది. 'కాదత్తా. మధుసూధన్‌గాళ్ళు అన్నారు. నీ పెద్దత్త లేచిపోయింది, కులం కాని వాడితో అని. లాస్టు అవర్లో అమ్మాయిలందరూ నవ్వేయడమే నన్ను చూసి. అసలు నాకూ దానికీ సంబంధం యేవిటిట,' మంచం దిగి దూరంగా నిలబడి ఓ చేతిని పాంటుజేబులోకి పోనిచ్చి మరో చేతిని క్రాఫు వెనకగా పెట్టి తల బరువుగా వెనక్కు వాల్చి యింటికప్పు మీదికి చూస్తూండి పోయాడు, ఎస్. ఎస్. ఎల్. సిలో అడుగు పెట్టిన రాధిక మేనల్లుడు.

వివరాలు చెప్పి పసిమనసు పాడుచేయడం రాధికకి యిష్టం లేక పోయింది. ముకుందు చాలాసార్లు అడిగాడు యిదివరకు. కాని అప్పటి దాకి పరిస్థితివేరు. ఇప్పటి సంగతి వేరు.

రాధిక కళ్ళముందు అందమైన ఆశ రాలు బారులు తీరి నిలబడి పోయాయి.

పిన్నికి,

'నమస్కారాలు. నేను పిన్నీ కృష్ణను. ఎన్నోసార్లు నీకు ఉత్తరం రాయాలని ప్రయత్నిస్తే అమ్మ వద్దని కేకలేసేది. అత్త మంచిదనీ, మావయ్య అసహాయకుడని అమ్మ నాన్నా అంటారు. అలాంటప్పుడు ఉత్తరం రాస్తే తప్పేం అంటాను నేను. నేను ఫిఫ్తుఫారంలోకి వచ్చేను. అమ్మ యెప్పుడూ యేడుస్తూ వుంటుంది.' సంకీర్ణ జాతికి పుట్టిన 'ఆడపిల్లని' అని కొట్టి, తిట్టి చివరకు కౌగిలించుకుని బావురు మంటుంది. ఈ సంగతి నీకు రాయాలనిపించి రాస్తున్నాను. చిన్నప్పుడు అమ్మ అనేది 'ముకుందు బావని చేసుకుంటావుటే' అని.

నాకు సిగ్గూ, బిడియంలాటివి వింతగా అనిపిస్తాయి. ఆఫ్టరాల్ వాటీజ్ దేర్. నేను బావని అడిగినట్లు చెప్పు. అత్తకి నా నమస్కారాలు తెలుపు. క్షేమంతో జవాబు కోరుతూ,

నీ

కృష్ణ.

* * *

ఉత్తరం చదివి నిట్టూర్చింది సరస్వతి. మామూలు ఉత్తరాలన్నీ వొక్కసారి చదివించుకుని చించేసేది. మేనకోడలు రాసిన యీ ఉత్తరం మటుకు జీవనాల అయిపోయింది. ఇప్పుడు సరస్వతి వృద్ధాప్యంలోకి అడుగు పెట్టింది.

భర్త దగ్గరికి వచ్చి అతని పక్కగా జరిగి కూర్చుని అంది. 'మన ముకుందానికి పెళ్ళీడు రాలేదంటారా.'

గోవిందు భార్య మొహంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు. ఆడపడుచు పెళ్ళి చేస్తేనే కాని యీ యింట మరో పెళ్ళి జరిగేందుకు వీలులేదని అన్న భార్యయేనా యిటు వంటప్పుడు ముకుందు పెళ్ళి విషయాన్ని గుర్తు చేసుంట?

రాధిక కొన్నాళ్ళుగా మానసిన వ్యాధిని పెంచుకుని ఆఖరికి దాన్ని శరీరానికి కూడా అంటించింది. మెల్లగా నీరసంగా అన్న దగ్గరికి వచ్చి వదిన మొహంలో తృప్తి చూసిఅంది.

'కృష్ణని మన ముకుందానికి యిచ్చి చేస్తే మనం చేసుకున్న పాపాలు కొన్నైనా మాసిపోతాయేమో కదన్నయ్యా!'

గోవిందు పులిక్కిపడ్డాడు. హంటర్ తీసు

కుని అతని వీపుమీద ఎవరో బలంగా కొడుతున్నారు. అతని ముఖం దుఃఖంతో, బాధతో మెలికలు తిరుగుతూండి పోయింది. క్షణంలో ఆ మొహంలో 'కసి' గిరి గీసుకుని నిల్చింది.

'తెలిసింది. తెలిసింది. అది. దాని కూతురు. అది చేసిన పనికి రాధి అనుభవిస్తున్నది చాలును. నా కొడుకూ, వాడి పిల్లలూ గురికావడానికి వీల్లేదు,' అనేశాడు ఆయాసంగా రొప్పుతూ.

రాధిక చాలాసేపు యేడ్చింది. నేరం యెవరో చేస్తారు. శిక్షలు పడేవి మరెవరికో. 'కృష్ణా నీకు నేనేమీ సహాయం చేయలేను,' అంది మంచం మీద వెనక్కు వాలిపోతూ.

*   *   *

హాస్పిటల్లో మంచం మీద పడుకుని కుళ్ళి కుళ్ళి యేడుస్తున్నాడు ముకుందం. గోవిందూ, సరస్వతీ కొడుకుని ఓదారుస్తున్నారు. రాధిక మెల్లగా వచ్చి మేనల్లుడి పక్కన కూర్చుని తలమీద చేయివేసి కళ్ళల్లో తిరిగే నీటిని అదుపులోకి తెచ్చుకుంటుంది 'అత్తా', అని బావురుమన్నాడు ముకుందు రాధిక మెడ చుట్టూ చేతులువేసి.

గొంతు పెగిలించుకుని అంది రాధిక. 'ఏడవకు. మన చేతిలో యేమీలేదు. ఖర్మ యిదంతా!'

'అత్తా నా కాలు,' కొట్టేసిన కుడి కాలు వంక దృష్టి నిలిపింది రాధిక. ఆ కాలు వున్న స్థానంలో కృష్ణ నిలబడివుంది కర్ర కాలుకి బదులుగా! నేను పూతగా నిలుచుంటాను పిన్ని, రాధిక కళ్ళు నులుముకుని మరీ చూసింది. శంఖాలతో వూదుతున్నట్టు అదే మాట చెవిలో రింగుమంటున్నది.

ముకుందాన్ని గుండెలకి హత్తుకుని శూన్యంలోకి చూస్తూండి పోయింది. గంట కొట్టినా ఆ రోజుకి తనే వుండిపోయింది. లేచివెళ్ళే వోపికలేని రాధిక.

*   *   *

'ఛ! యెంత సిగ్గులేనిమాట అన్నారు మీరు. మీ పిల్లడు అవిటివాడు అని, అది పుట్టుకతో అవిటిదని దానికియిచ్చి ముడి వేస్తానంటారా? వెలివేయడం అవిటికన్నా తక్కువేమీకాదు. మీరు నాకు భర్త కావచ్చు. కానీ యిలాంటి అన్యాయం మాటలు అంటే నేను వూరుకోలేను', సరస్వతి విసురుగా అంది.

"కృష్ణా ట్యుటోరియల్స్"

51. చెల్ల పిళ్ళయార్ కోయిల్ వీధి.
రాయపేట ... మద్రాసు—14. ఫోన్: 81602
ప్రైవేటుగా చదివి
ఆంధ్ర, వెంకటేశ్వర, మరియు కర్నాటక విశ్వవిద్యాలయముల

* మెట్రిక్యులేషన్ * ప్రీ యూనివర్సిటీ
* బి. ఏ. పరీక్షలకు హాజరుకండి.

* దిట్టమైన పోస్టల్/పర్సనల్ ట్యూషన్ యివ్వబడును.
* ప్రొఫెసర్. ఎస్. కృష్ణ అయ్యర్, ఎం. ఏ, కే. సుందరం ఎం. ఏ., ఎం. ఇడి, మరియు యితర అధ్యాపకులు స్వయముగా తరగతులు నడుపుదురు.
* కాలేజీ "పుస్తక—బ్యాంకు" నుండి పోస్టుద్వారా మరియు స్వయంగా ట్యూషన్ పొందే విద్యార్థులకు భాషా పాఠ్య పుస్తకములు ఉచితముగా సప్లయి చేయబడును.
* ఆంధ్ర మెట్రిక్ — తెలుగు, ఇంగ్లీషు భాషలు రెంటిలో తర్ఫీదు యివ్వబడును.
* ఇతర కోర్సు లన్నియు ఇంగ్లీషు భాషలోనే బోధింపబడును.

ప్రాస్పెక్టస్‌కై 0—50 పైసలు మనియార్డరు పంపండి.

ఎస్. కే. అయ్యర్, ఎం. ఏ.
ప్రిన్సిపాల్.

లోమ

భారతదేశపు మొత్తం హేర్ ఆయిల్ ఎగుమతులలో 16% గా లెక్కించబడింది!

ఔను, లోమ ఇప్పుడు భారతదేశంలో వలెనే విదేశములందు కూడా ప్రసిద్ధయింది. అది ఎందువల్లననగా లోమ అత్యంత ఆనందకరమైనది, కేశ పోషణ మరియు శిరోజములను నలుపు చేసే హేర్ ఆయిల్స్ అన్నింటి కంటె అత్యంత గుణకరమైనది. సిద్ధ. సుర్మము. చిన్న సీసాంలోను మరియు పొమేడ్‌గా ట్యూబ్‌లలోను లభించుచున్నది

ప్రత్యేక ఏజెంట్లు మరియు ఎగుమతిదార్లు:
ఏమ్. ఏమ్. ఖంభట్‌వాలా, అహమదాబాద్—1.

'శ్రేష్ఠం నిజా. వాడికి కాలులేదు. దీనికి పెళ్ళికావడం యెంతకష్టమో అనుభవించి నీకు తెలియదంటే నేను నమ్మను. మేన మామ కొడుకును అదే చేసుకోకపోతే...', నీళ్ళు నమిలాడు.

'ఇప్పుడు తెలిశాయి వారి వరుసలు. తల్లి తండ్రులు చేసినదానికి పిల్లలు అనుభ వించాలి అన్నారు నీ నోటితోనే. ఆరోజు లగా గ్రహింపుశక్తి లేకపోయిందన్నమాట. కృష్ణకి తల్లీ తండ్రీ వున్నారు. వాళ్ళపిల్లని వాళ్ళ స్థితిగతులకి తగిన సంబంధాన్ని యిచ్చి చేయగలరు, పెళ్ళిఅంటూ చేయా లనుకుంటే. కానీ...నేను...నేను మూర్ఖ త్వానికాను అవిటివాడికియిచ్చి దాని మనసు అవిటి చేయడానికి', కిటికీ వూచలు ఆధారం చేసుకుని నిలబడి కళ్ళల్లో నీటిని భద్రంగా గుండెల్లోకి పంపించేస్తోంది సరస్వతి.

'రాధీ', బలంగా కేక పెట్టాడు గోవిందు రాధిక అన్న యెదుట హాజరుగా నిల్చుంది. 'ఏమిటి అన్నయ్యా?' అంటూ.

'కృష్ణని ముకుందానికి చేసుకుంటా మని ఓ కార్డు రాసి పడెయ్యి అంతే,' గోవిందు గదిలో పచార్లు ప్రారంభించాడు.

రాధిక నివ్వెరపోయింది.

'ఒద్దు. వీల్లేదు ముకుందా! నువ్వునేను పోయాక ఎలాగూ అడుక్కుతింటావు. ఆ సంగతి నాకు తెలుసు. కానీ దాని బ్రతు కులో నిప్పులు పోయకు,' సరస్వతి గట్టిగా అంది.

'నువ్వు రాస్తావాలేదా రాధీ,' గోవిందు కళ్ళు ఎర్రజీరలు కముకున్నాయి.

'రాధీ,' సరస్వతి కంఠంలో వురుములు యుద్ధం చేస్తున్నాయి.

విత్తరపోయి చూసింది రాధిక.

'నేనెలాగూ ఆట్టేకాలం బ్రతికేది లేదు. కృష్ణకీ మనకీ యెలాంటి సంబంధమూ లేదు. దానికి నువ్వు వుత్తరం రాయడానికి వీల్లేదు.'

సరస్వతి చెంప అదిరిపోయింది. గోవిందు దిగవర బయటికి వెళ్ళిపోయాడు. కాపురానికి కాలుమోపిన యిన్నేళ్ళకి సరస్వతి దెబ్బతింది భర్తచేత. యేడవలేదు అందుకు. చిన్నగా నవ్వుకుంది ఆచేతి ఆనవాలుని ప్రేమగా తడుముకుని.

* * *

మరో రెండేళ్ళకి యిద్దరూ వొకరి

శిక్ష

వెనుక వొకరు సరస్వతి, కొంగు ఆసరాగా గోవిందూ స్వర్గానికో, మరి నరకానికో తెలియగాని వెళ్ళిపోయారు రాధికచేతికి ముకుందాన్ని అందించి.

రాధిక కళ్ళు యెర్రబడిపోయాయి. గదిలో దీపం వెలిగింది. గోవిందు తాలూకు, సరస్వతి తాలూకూ యిన్నాళ్ళ ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, అనుభవాలు డబ్బుతో రోగిష్టి బ్రతుకు రాధికా, అవిటి బ్రతుకు ముకుందూ యీడ్చేస్తున్నారు.

రాధికకు బాగా తెలుసు. చివరి ఘడి యలు అంటే యేమిటో?

అమావాస్య రాత్రులు విలయతాండవం చేస్తున్నాయి. ప్రపంచం గొంతుచించుకుని భయంగా అరుస్తున్నది రాధిక చెవుల్లో. ముకుందు రాధిక పక్కగావచ్చి కూర్చుని తలమీద చేయివేసి వెంట్రుకలు సరిచేస్తు న్నాడు. 'అత్తా' అంటూ వాడి పిలుపులో అనురాగం యుగాలకి సరిపోయేట్టువుంది.

రాధిక బలవంతంగా కళ్ళుతెరిచింది. ఆ కళ్ళల్లో జీవకళ దూరమైపోతూవుంది. అన్నా వదినా, అక్క కృష్ణ ... ఆఖరికి మిగిలిపోతున్న ముకుందూ వరుసగా కని పిస్తున్నారు.

'నాయనా ముకుందూ,'అంటోంది రాధిక. వాడు అత్త గుండెల మీద తల ఆన్చేడు.

'కృష్ణ రాలేదా బాబూ,' అంది ఆయాసంగా.

'లేదత్తా. టెలిగ్రాం కూడా యిచ్చాం చాను.'

'అది రాదు. ఎందుకు వస్తుంది. పిన్ని ఎలాటి సహాయం చేయలేదని కోపగించి వుంటుంది.'

'నువ్వు బెంగపెట్టుకోకత్తా. వస్తుంది.' ముకుందు వోదారుస్తున్నాడు. వాడి కళ్ళు తడిగా వున్నాయి. ఈ చీకట్లో కొద్దిగా వెలుగుతున్న యీ ఆముదం దీపం ఆరి పోతే వాడి బ్రతుకు కటిక చీకటి అని గ్రహించి దుఃఖాన్ని మింగుతున్నాడు.

హోరు గాలికి తలుపులు ఛడేలుమంటూ కొట్టుకుంటున్నాయి. వీధివాకిలి తెరుచు కుంది. కృష్ణ చేతి సంచితో వచ్చేసింది. అంతవరకూ చూడని కృష్ణని యిద్దరూ గుర్తుపట్టలేక పోయారు కాస్సేపు.

'పిన్నీ' మంచం మీదికి వొంగి చెవిలో గుసగుసలాడింది. కృష్ణ: 'ఆఁ' అంది రాధిక బలవంతంగా.

'మీరు కూర్చుందుకు స్టూలు నేను తేలేను. ఆ పక్కగదిలోనేవుంది. శ్రమ అను కోక తెచ్చుకుంటారా?', అమాయకంగా అన్నాడు ముకుందం.

కృష్ణ చురుగ్గా చూసింది.

రాధికచేతిని బలవంతంగా పైకియెత్తి కృష్ణ తలమీద వుంచింది మాట్లాడ లేకుండావున్న స్థితిలో. కృష్ణ తనలో ప్రవ హించే రక్తం తాలూకు మనుష్యుల్ని ప్రప్రథ మంగా తేరపారి చూస్తూండిపోయింది.

'వీడు నీకు బావ,' రాధికగొంతు పెగ ల్లేదు ఆపైన.

'గ్రహించేను,' కృష్ణ స్టూలు తెచ్చు కోలేదు. ముకుందు పక్కనే చోటుచేసుకుని కూర్చుంది.

'పిన్ని నేను వచ్చేశాను. నువ్వింక బెంగ పెట్టుకోకు. అమ్మా, నాన్నకి చెప్పిరాలేదు అంతే.'

రాధిక పులికిపడింది.

అంతకంతకు రాధికలో చలనం దూరమై పోతోంది. నలభై సంవత్సరాలు మార్పులేని బ్రతుకులో విసిగిపోయింది రాధిక శరీరం. సమయంవస్తే రెక్కలు గట్టుకుని పరి గెట్టాలని చూస్తూనేవుంది. 'ఎంత...పని చే...సేవు.'

రాధిక మాటవిని ముఖంలోకి గాంభీర్యాన్ని తెచ్చుకుని కృష్ణ అంది: 'ఆ తలుపులు మూసుకుపోయినా యిబ్బందిలేదు. ఈ వాకిలి మూసేదీ తెరిచేదీ నా చేతిలో వుంది.'

రాధిక మనసు కొద్దిసేపు రెపరెపలాడింది. కృష్ణ తెలివితేటలుండీ చదువుకున్న పిల్ల కావడం ముకుందం అదృష్టం అనుకుంది. రాధిక కళ్ళముందు హాస్పటల్లో ముకుందు కాలి స్థానంలో కనిపించిన కృష్ణ కదిలి ఆ పాపల్లో శాశ్వతంగా నిలిచి పోయింది.

ముకుందం అనుకున్నాడు. 'మెర్క్యురీ లైట్లు యిన్ని వొక్కసారిగా వెలిగి పోయా యేమిటి యీ అంధకారంలో' అని.

పాపం! రాధికే ... అర్థం లేని శిక్ష లన్నేళ్ళు అనుభవించింది, ఎవరో చేసిన దానికి.

రాధిక కళ్ళు అలాగే చలన రహితంగా వుండి పోయాయి. ☐